'సురక్ష' శిబిరాల్లో కార్పొరేట్ వైద్యం



పరదేశిపాలెంలో వైద్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- పరదేశిపాలెం, బింద్రానగర్‌లో ఉచిత వైద్య శిబిరాలు



బింద్రానగర్‌లో మందులు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ప్రజలకు అందిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు కొత్త పరదేశిపాలెం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ప్రదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారని కొనియాడారు. అంతకుమించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. కొత్తగా పలు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌ల ఏర్పాటుతోపాటు, 17 వైద్య కళాశాలలు తీసుకొచ్చామన్నారు. ఇప్పటికే 5 కాలేజీలు పారంభించామని తెలిపారు. ఇప్పటి వరకూ వైద్య రంగంలో 41 వేల పోస్టులు భర్తీ చేశారని గుర్తు చేశారు. శిబిరంలో సేవలు అందించిన వైద్యులు అనంత్, కె.మౌనిక, స్నేహప్రియ, చైతన్య, లక్ష్మి పార్వతి, సింధూరి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, బోర సూర్రెడ్డి, బి.గురుమూర్తి రెడ్డి, పల్ల సురేష్, సత్యాల కొండమ్మ, బోర అప్పలరెడ్డి, చందక అప్పలరాజు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిపుణులతో మెరుగైన వైద్య సేవలు

జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలు ప్రజలకు అవసరమైన వైద్య సేవలు నిపుణులైన వైద్యులతో ఉచితంగా అందించడమే కాకుండా మెరుగైన వైద్యం కోసం ఆరోగ్య శ్రీ ద్వారా రిఫర్ చేయిస్తున్నామన్నారు. ఈ సేవలను అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యులను అభినందించి ఘనంగా సన్మానించారు. అవసరమైన పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, పోతిన శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



దినేష్‌ని అభినందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ ఫెయిర్స్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన గొలగాని దినేష్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దిబ్బడిపాలెంలో బుధవారం సన్మానించారు. మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన దినేష్ మధురవాడలోని విజయం పాఠశాలలో చదువుతున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి తన వంతు సాయం అందిస్తానని తెలిపారు. దినేష్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, భీమిలి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిన్నింటి వెంకట రమణ, కాకర వెంకట రమణ, శిష్టకరణాల కార్పొరేషన్ డైరెక్టర్ కంతిమహంతి చంద్రమౌళి, నాయకులు పడాల రాము, తోనంగి అప్పారావురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ఘనంగా లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం: కీతిన్‌పేటలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా లక్షతులసి పూజ చేశారు. తొలుత విశ్వక్సేన ఆరాధన, ప్రత్యేక హోమం చేశారు. అనంతరం లక్షతులసి పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహానారాయణ సేవ చేశారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.శ్రీనివాసరావు, కె.భానోజీరావు, కె.చంద్రశేఖర్, వి.తాతాజీ, ఆలయ అర్చకులు శేషాచార్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు




స్వతంత్రనగర్‌లో లబ్ధిదారుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అర్హులు అందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం జీవీఎంసీ 5వ వార్డు స్వతంత్రనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇళ్ల వద్దకే పింఛన్, రేషన్ అందించాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. అన్ని రకాల సంక్షేమ పథకాలు వివక్ష లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించిన సంక్షేమ పథకాల కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా గత మూడేళ్లలో రూ.3.20 లక్షల మేర లబ్ధి చేకూరిందని పీతల చంద్రకళ హర్షం వ్యక్తం చేశారు. పార్కు అభివృద్ధి, బోరు బావి ఏర్పాటు, వీధి దీపాలు, హుద్‌హుద్ కాలనీలో తాగునీరు, యూజీడీ తదితర సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కుడితి రామారావు, సచివాలయ కన్వీనర్లు కాశ్మీర్ అప్పారావు, జీలకర్ర గణేష్, జ్యోతిష్, ఉగ్గిన నాగరాజు, రైల్వే బోర్డు సభ్యుడు, ఎన్.బాబ్జి, వాండ్రాసి రవి, రామారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, మహిళా అధ్యక్షులు బండారు శివలక్ష్మి, చేకూరి రజని, గాయత్రి, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో సుత్తమ్మతల్లి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లిని బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. గజమాలలు, వివిధ రకాల పూలదండలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

రోడ్డు పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ యర్ర రాజు

ఆనందపురం : మండలంలోని గండిగుండం – రామవరం రోడ్డు పునర్నిర్మాణ పనులకు బుధవారం స్థానిక సర్పంచ్ యర్ర రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రభుత్వ నిధులు మంజూరు చేయగా, పంచాయతీ నుంచి రూ.6 లక్షలు కేటాయించామన్నారు. రోడ్డు పునర్నిర్మాణ పనులు పూర్తయితే వాహన చోదకులకు ఇబ్బందులు తప్పనున్నాయని తెలిపారు.

కొనసాగుతున్న కార్తీక దామోదర ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో కార్తీక దామోదర మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మంగళ హారతితో ప్రారంభమై గోపిగీత, భగవద్గీత 12వ అధ్యాయం, శిష్టాష్టకం పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

అంగన్‌వాడీల్లో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస: భీమిలి ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 21 నుంచి 35 ఏళ్ల వయసు, పదో తరగతి ఉత్తీర్ణత కలిగిన స్థానిక మహిళలు ఈ పోస్టులకు అర్హులు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7న సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను భీమిలి ప్రాజెక్ట్ అధికారి కార్యాలయానికి నేరుగా లేదా పోస్టు ద్వారా పంపించవచ్చు. వీటిని ఓపెన్ కాంపిటీషన్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు.

ఖాళీల వివరాలు: మినీ అంగన్‌వాడీ కార్యకర్త (2). ఈగలవానిపాలెం, కల్లివానిపాలెం. అంగన్‌వాడీ సహాయకురాలు (4). నీలయమ్మసత్రం, కొనసవానిపాలెం, బంటుపల్లి కళ్లాలు, టి.నగరపాలెం.

అమరజీవికి ఘన నివాళి

మధురవాడ: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, సూపరింటెండెంట్ అప్పలరాజు కొనియాడారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకల్లో వారు పాల్గొన్నారు. ముందుగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

పద్మనాభం: మండలంలోని రేవిడిలో అత్తింటి వారి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన పడాల ఉదయలక్ష్మి కుమార్తె నాగలక్ష్మితో పద్మనాభం మండలం రేవిడి గ్రామానికి చెందిన బత్తుల కనకరాజుకు 13 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహం జరిగిన కొన్నేళ్ల తర్వాత నుంచి నాగలక్ష్మిని భర్త కనకరాజు, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో మనస్థాపం చెందిన నాగలక్ష్మి ఇంటి హాలులో మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తల్లి ఉదయ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

మధురవాడ బాలిక ప్రతిభ



గోల్డ్ మెడల్‌తో అభిషాకళ

మధురవాడ: జిల్లా స్థాయిలో స్కేట్ బోర్డింగ్ పోటీల్లో మధురవాడ స్వతంత్రనగర్‌కి చెందిన బాలిక విశేష ప్రతిభ కనబరిచింది. మధురవాడ ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో చదువుతున్న బి.అభిషాకళ జిల్లా స్థాయి పోటీల్లో అండర్ – 17 కేటగిరీలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఇటీవల విశాఖలో డిస్ట్రిక్ట్ రోలర్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు సుమారు 60 మంది హాజరు కాగా వీరిలో అత్యున్నత ప్రతిభ చూపింది. విజేతకు మధురవాడ క్రీడాకారులు, పెద్దలు అభినందనలు తెలిపారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ



దుస్తులు అందిస్తున్న జెడ్సీ రాము, మల్లికార్జునరావు

భీమునిపట్నం: భీమిలిలోని సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పారిశుధ్య వాహనాల క్లాప్ సిబ్బందికి యూనిఫారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ ఈ – క్లాప్ వర్కర్స్ రోజూ ఎంతో శ్రమతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారు చేస్తున్న సేవలను గుర్తించి దుస్తులు ఇవ్వడం ఎంతో మంచి విషయమని, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. వాకర్స్ అధ్యక్షులు కోట మల్లికార్జునరావు మాట్లాడుతూ తమ వంతు సహకారం అందివ్వాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యదర్శి అవనాపు అప్పలనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా మహేష్

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చిట్టివలసకు చెందిన గాధం మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నుంచి నియామక పత్రం అందుకున్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఆహ్వానం

ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీలకు క్రీడాకారులను ఆహ్వానిస్తున్నట్టు మండలంలోని బోయిపాలెం ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ.అప్పలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ టెన్నిస్ మాల్కం గేమ్స్‌లో పాల్గొనబోయే క్రీడాకారులు ఈ నెల 2న గురువారం పెందుర్తి ఉన్నత పాఠశాలలో తైక్వాండో అండర్ – 17 పోటీలకు, ఈ నెల 3న అండర్ – 14 పోటీలకు, ఈ నెల 4న చంద్రపాలెం ఉన్నత పాఠశాల పక్కన గల ద్రోణంరాజు కళ్యాణ మండపంలో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని పీడీ అప్పలరాజు సూచించారు. మిగతా వివరాలకు 7386354492, 8247375914 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు 'సురక్ష' శిబిరం

పీఎం పాలెం: స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ నిపుణులైన వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తారని స్థానిక వైద్యాధికారి సుజాన్ పిల్లా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నవ కవులకు మార్గదర్శి శ్రీశ్రీ



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వం ఉత్తమ విలువలతో కూడినదై సమాజ ఉన్నతికి దోహదపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఔత్సాహిక కవులు పూర్వ కవుల రచనలు ఎక్కువగా చదవాలని, నవ కవులకు మార్గదర్శి మహాకవి శ్రీశ్రీ అని తెలిపారు. నేటి నవ కవులందరూ శ్రీశ్రీ సాహిత్యాన్ని చదవాలని సూచించారు. డాక్టర్ కె.జి.వేణు తెలంగాణ ప్రజాకవి గూడ అంజయ్య జీవితం, సాహిత్యం గురించి ప్రసంగించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవి అంటే కృష్ణశాస్త్రి అని, ఆయన భవకవిత్వానికి ఆద్యుడని, సంస్కారవంతమైన కవిత్వం రాశారని తెలియజేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో రామతాత నీలి మేఘాలలో కవిత, కుమారి ఆశ్రిత ఎందుకీ ఊగిసలాట కవిత, కె.వి.ఎస్.మూర్తి లోకం పోకడ కవిత, కొత్తూరి రమణ పల్లె పడుచు కవిత, చిన సూర్యనారాయణ సమైఖ్య హృదయ సంస్కారం కవిత, రమణమూర్తి పులిలా కవిత చదివి వినిపించారు.

చెరువు నుంచి దుర్వాసన

తగరపువలస: చిల్లపేట – చిట్టివలస గ్రామాల మధ్య చెరువు నుంచి భారీగా దుర్వాసన వస్తోందని, అరికట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చెరువు దుర్వాసన వల్ల భీమిలి రోడ్డులో ఉన్న జీరుపేట గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువును ప్రక్షాళన చేసి ప్రజలకు ఉపశమనం కలిగించాలని జెడ్సీ రాము దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు.

పాఠశాలల విలీనంపై సమీక్షించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

పద్మనాభం: గత విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం కిలోమీటరు పరిధిలోపు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న మూడు, నాలుగు, ఐదు తరతగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో వీలీనం చేసిందని, దీన్ని పునఃసమీక్షించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పద్మనాభం మండలంలో విలీనమైన ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల విలీనంతో ఒకటి, రెండు తరగతుల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గిపోయిందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్, జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, మండల శాఖ అధ్యక్షుడు ఎన్.నారాయణరావు, కార్యదర్శి కె.సన్యాసిరావు, గౌరవ అధ్యక్షుడు బోని చిన్నారావు పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా దీపావళి



మాట్లాడుతున్న జలగం కుమారస్వామి

సీతంపేట: దీపావళి పండగను కాలుష్య రహితంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకుందామని భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి, ఆవు పేడతో తయారు చేసిన ప్రమిదలో నూనె, నెయ్యి వేసి దీపాలు వెలిగించాలన్నారు. అత్యంత శబ్ద, వాయు కాలుష్యం కలిగించే చైనా దేశానికి చెందిన టపాసులు కాల్చి అనారోగ్యం తెచ్చుకోవద్దని, పశుపక్ష్యాదులకు హాని కలగకుండా పండగ చేసుకోవాలని సూచించారు. రసాయనాలు, భారలోహాలతో తయారు చేసిన టపాసులు అత్యంత ప్రమాదకరమని అందరూ గ్రహించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ మాట్లాడుతూ పత్తి పండిస్తున్న రైతులను ఆదరించి, వారు పండించిన దూది ఒత్తులతో దీపాలు వెలిగించాలన్నారు. కుమ్మరి తయారు చేసిన ప్రమిదలు, గానుగలో తయారు చేసే నూనె వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో నగర మిద్దె తోటల సంఘం ప్రతినిధి ఎం.ఐశ్వర్య, రైతుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, సిహెచ్.మురళీధర్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌తో మానసిక సమస్యలకు విముక్తి

కొమ్మాది: పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో, వృత్తిలో ఎదురయ్యే ఒత్తిళ్లను తట్టుకుని నిలవాలంటే కౌన్సెలింగ్ ద్వారానే సాధ్యమని గీతం ప్రో వీసీ వై.గౌతమ్‌రావు అన్నారు. బుధవారం గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అప్లైడ్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యువతరం ఆకర్షణలకు లోనై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో గీతం ఇన్‌చార్జి డీన్ బండి కామయ్య, కె.చిన్నయ్య సూరి పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీటి ప్రవాహం



స్థానిక క్రికెట్ స్టేడియం సమీపంలో హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డులో మురుగునీరు

పీఎం పాలెం: స్థానిక క్రికెట్ స్టేడియం సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గతంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో పూడిక పేరుకుపోవడంతో రోడ్డుపై మురుగునీరు పొంగి ప్రవహిస్తోంది. డ్రైనేజీల నుంచి ఉబికి వస్తున్న మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో మలేరియా, డెంగ్యూ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి మురుగు నీటిని తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కాలనీవాసులు కోరుతున్నారు.



గంధవరంలో ఇల్లు దగ్ధం



ఇంటిలో కాలిపోయిన ఫ్రిజ్

పద్మనాభం: మండలంలోని గంధవరంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక శ్లాబ్ ఇల్లు కాలిపోయింది. గ్రామానికి చెందిన గుమ్మిడి రాంబాబు ఇల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఫ్రిజ్, ఫ్యాన్లు, మిక్సీ కాలిపోయింది. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు బి.వి.ఎస్.ఎన్.రాజు బాధితుడిని పరామర్శించారు.

వీరుల త్యాగం వృథా కానివ్వం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. నాటి వీరుల త్యాగాన్ని వృథా కానివ్వమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 993వ రోజు బుధవారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అందరికీ ఆదర్శమన్నారు. అమరజీవి స్ఫూర్తితో, పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని కేంద్రప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేవరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.